కలెక్టరేట్ ఎదుట ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి

రెండో రోజూ ఎఐకెఎస్ కౌన్సిల్ సమావేశాలు

- నాలుగు తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు కర్నూలులోని ఎన్.శంకరయ్య నగర్ వేదికగా శనివారం రెండో రోజు కొనసాగాయి. రెండో రోజు నాలుగు తీర్మానాలకు జాతీయ కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టం తేవాలని, సమగ్ర పంటల బీమా అమలు చేయాలని, ఎరువుల మీద సబ్సిడీ కోత ఎత్తివేసి రాయితీలు కొనసాగించాలని, విద్యుత్ సంస్కరణల బిల్లును ఉపసంహరించుకోవాలని కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. జాతీయ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలను ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు టి.సాగర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ గతేడాది ఎఐకెఎస్ అఖిల భారత మహాసభ కేరళలోని త్రిసూర్‌లో జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకూ చేపట్టిన ఉద్యమాలను సమీక్షించామని తెలిపారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ఇవ్వాల్సిన భూములు ఇవ్వకుండా అటవీ సంరక్షణ చట్టానికి తూట్లు పొడిచేలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన దానిపై పోరాటాలు చేసేలా అన్ని సంఘాలతో కలిసి పోరాటాలు చేయాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. ఎగుమతులు, దిగుమతుల విషయంలో రైతాంగానికి ఉపయోగపడేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. కేంద్రం తన వైఖరి మార్చుకోకపోతే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేలా రాజకీయ నిర్ణయం తీసుకునేలా రైతులను సన్నద్ధం చేయాలని, సెమినార్లు, సదస్సులు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ సమావేశంలో 29 రాష్ట్రాల కౌన్సిల్ కమిటీ సభ్యులు మాట్లాడారని, కేంద్ర ప్రభుత్వ విధానాలు ఎలా రైతులకు నష్టం చేస్తున్నాయి, వాటిపై ఎలా పోరాడుతున్నారని చెప్పారన్నారు. పాడి రైతులకు బోనస్ ఇస్తామన్న

మాట్లాడుతున్న ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు సాగర్

ఇవ్వకపోగా పాల సేకరణ పేరుతో ప్రయివేటు కంపెనీలకు లీజుకు ఇస్తున్నారన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దానిపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. కరువు మండలాలను తక్కువగా ప్రకటించారని, ప్రకటించిన మండలాల్లోనూ కరువు సహాయక చర్యలు చేపట్టడం లేదన్నారు. అన్ని పంటలకూ ఎకరాకు రూ.6800 నష్టపరిహారం ఇవ్వాలనడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై ఈ నెల 21న రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాలుగా సచివాలయాలు, మండల స్థాయిల్లో ఆందోళనలు చేపట్టనున్నామని, ఈ ధర్నాల్లో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు. ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా సత్యా ఇన్‌లో సమావేశం జరుగుతున్న హాల్ ప్రాంగణం వద్ద మెడికల్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు ఎస్.ఖలీల్ అహ్మద్, ఏ.వెంకట్, కె.బసవరాజు లు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులకు వారికి కావలసిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరం ఆదివారం కూడా ఉంటుందని తెలిపారు.

వైద్య శిబిరం నిర్వహిస్తున్న మెడికల్ రెప్స్ నాయకులు

పక్కాగా సంక్షేమ పథకాల అమలు

- కేంద్ర మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ - కోడుమూరులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్/కోడుమూరు

కేంద్ర ప్రభుత్వ సహాయంతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పక్కాగా అమలు కావాలని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ తెలిపారు. శనివారం కోడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వంద శాతం లబ్ధిదారులకు అందించాలని 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'ను నవంబర్ 25 నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్ర జనవరి 26 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మంచి లబ్ధి చేకూరుతోందన్నారు. అర్హులై సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారు ఉండకూడదనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు జరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందించాలని చెప్పారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ నీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సౌకర్యాల కల్పన, ఆయుష్మాన్ భారత్ వంటి సంక్షేమ పథకాలు అందేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు అర్హులను నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఈ కార్యక్రమాన్ని 149 పంచాయతీల్లో నిర్వహించి అర్హులను గుర్తించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అందజేస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు వారి ఆరోగ్య రక్ష బీమాను అందజేశామన్నారు. జన్ ఔషధి దుకాణాలు ఏర్పాటు చేసి పేదలకు నాణ్యమైన మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కోడుమూరు పంచాయతీలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' నిర్వహించినట్లు చెప్పారు. ఏదైనా పథకం కింద లబ్ధి పొందడానికి అర్హత ఉండి లబ్ధి పొందని వారుంటే వివిధ సంక్షేమ పథకాలు అందజేసే సంబంధిత శాఖల స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటిలో రిజిస్టర్ చేసుకొని సంక్షేమ పథకాల లబ్ధి పొందవచ్చని చెప్పారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్పయాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అర్హులైన 607 స్వయం సహాయక సభ్యులకు రూ.3.03 కోట్ల చెక్కును అందజేశారు. జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్, సిపిఒ హిమాప్రభాకర్ రాజు, డిపిఒ నాగరాజు నాయుడు, బిజెపి నాయకులు నీలకంఠం, డాక్టర్ పార్థసారథి, విరుష రెడ్డి, ఎంపిపి రుతమ్మ, ఖాదీ బోర్డు మాజీ ఛైర్మన్ చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆరంభం..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఉత్సాహంగా ఆరంభం అయ్యాయి. ఈ సందర్భంగా కర్నూలు నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీలో కర్షక లోకం కదం తొక్కింది. ఉదయం సత్య ఇన్ రెసిడెన్సీలో శంకరయ్య నగర్ వేదికగా ప్రతినిధుల సభ ప్రారంభం అయ్యింది. ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే పతాక ఆవిష్కరణ చేశారు. నాయకులు, కౌన్సిల్ కమిటీ సభ్యులు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే అధ్యక్ష ఉపన్యాసం చేశారు. మధ్యాహ్నం భారీ ర్యాలీ నిర్వహించారు. సుందరయ్య సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీరామ్ థియేటర్, మౌర్య ఇన్, రాజ్ విహార్, కిడ్స్ వరల్డ్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ మీదుగా పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ క్రిష్ణన్ ర్యాలీ అగ్ర భాగాన నిలిచి ముందుకు నడిపించారు. ర్యాలీ లో రైతులు ఎర్ర కండువాలు, ఏఐకెఎస్ జెండాలతో ర్యాలీ ఆద్యంతం ఎరుపెక్కింది. అత్యంత క్రమశిక్షణతో రైతు సంఘం నినాదాలు చేస్తూ అత్యంత ఉత్సాహంగా ముందుకు కదిలారు. ర్యాలీకి ముందు భాగాన స్వాగతం పలుకుతూ ఎపి డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన డబ్బుల దరువు నత్యంతో నగరం దద్దరిల్లింది. ర్యాలీలో ముందు భాగాన ఎర్ర దుస్తులు ధరించిన వాలంటీర్లు కవాతుతో ఘన స్వాగతం పలికారు. వెంకటేష్ థియేటర్ సమీపంలో యుటిఎఫ్ నాయకులు సంఘీభావాన్ని తెలియజేస్తూ పూల వర్షంతో ర్యాలీకి స్వాగతం పలికారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా రైతాంగంలో భారీ ఎత్తున చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిలించేలా రైతుల ప్రదర్శన కొనసాగింది. ర్యాలీ అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్య అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మతికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు.

అంగన్వాడీల సమ్మె ఉధృతం

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఉధృతం చేశారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు మొదలు పెట్టింది. సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టే పనికి పూనుకుంది. దీనిపై అంగన్వాడీల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా తమ సమస్యలు సాధించుకునే వరకూ సమ్మె ఆగదని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచి ఇస్తామన్న వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల భిక్షాటన
- 5వ రోజూ సమ్మె

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నిర్మల, జనసేన పార్టీ జిల్లా నాయకులు సురేష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మునెప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మె శనివారం 5వ రోజుకు చేరింది. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి భిక్షాటన చేపట్టారు. సమ్మె సందర్భంగా చేపట్టిన దీక్షలకు సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీలు విధులకు హాజరు కాకపోతే పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారిని అంగన్వాడీ టీచర్లుగా నోటిఫికేషన్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. 2019 అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని జగన్‌రెడ్డి హామీఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ కన్నా రూ.వెయ్యి అదనంగా ఇస్తానని చెప్పి ఇప్పుడు మంత్రివర్గం వేసి ఒక్క నయా పైసా కూడా అంగన్వాడీలకు ఇవ్వబోమని చెప్పడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హామీనే వారు అడుగుతున్నారని, హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం, గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని తెలిపారు. ఇలాగా వ్యవహరిస్తే రాబోయే కాలంలో ఇంటికి పంపడం తప్పదని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని చర్చలు జరిపి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే అన్ని రాజకీయ పార్టీలూ, విద్యార్థి, యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎపి మహిళా సమైక్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రవణమ్మ, టిడిపి మహిళా నాయకులు మాధవి లత, శర్మ, రేష్మ మద్దతు తెలిపారు. యూనియన్ నాయకులు బాలదుర్గమ్మ, చౌడేశ్వరి, ఎఐటియుసి నాయకులు రామాంజనేయులు, సిఐటియు కార్యదర్శి నరసింహులు, రాజగోపాల్, రామాంజనేయులు, గోపాల్, నాగేశ్వరరావు, మల్లన్న మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, బాలదుర్గమ్మ, నాగమణి, మహేశ్వరి, చౌడేశ్వరి, సునంద, రాధిక పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు

దీక్షలకు మద్దతుగా మాట్లాడుతున్న నాయకులు

మాట్లాడుతున్న మపర్ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్

మైపర్‌లో ఘనంగా సైంటిఫిక్ సెషన్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలోని ఏ క్యాంప్ నందు గల మైపర్ ఫార్మసీ కళాశాల యందు సైంటిఫిక్ సెషన్‌ను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైంటిఫిక్ సెషన్స్ వల్ల విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించుటకు ఎంతో ఉపయోగపడుతుందని, అప్పుడప్పుడు ఈ సైంటిఫిక్ సెషన్స్ వల్ల వారిలో ఉన్న సృజనాత్మకత కాంపిటేటివ్ స్పిరిట్ వక్యాబులరీ మొదలగున్నవి పెంపొందించుటకు ఉపయోగపడునని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ డిపార్ట్మెంట్స్ సంబంధించిన పోస్టర్ ప్రజెంటేషన్‌ని ఇచ్చారు. అత్యుత్తమమైన వాటికి బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాసర్ల సురేష్, అకాడమిక్ డేన్, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ శేహేన్నా, డాక్టర్ రఘువీర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-మద్దికెర

మద్దికేర మండల కేంద్రంలో జడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు అధ్యక్షతన మండల స్థాయి బాలల క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా తమ నైపుణ్యాన్ని చూపించాలని అన్నారు. క్రీడల్లో,ఉత్సాహవంతులైన,విద్యార్థులుమండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి రాష్ట్రస్థాయి వంటి అత్యున్నతమైన స్థాయికి ఎదగాలని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి గోపాల్ , మాజీ ఎంపీటీసీ డిఎస్ శ్రీనివాస్, హాజరయ్యారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

గూడూరులో అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన

ప్రజాశక్తి-గూడూరు

ఐదో రోజు అంగన్ వాడీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గూడూరులో భిక్షాటన చేశారు. వెల్దుర్తితో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు.

అంగన్వాడీల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె గూడూరులో ఐదో రోజుకు చేరుకుంది. గూడూరులో సిఐటియు కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన అంగన్వాడీల దీక్షకు టిడిపి సంఘీభావం తెలిపింది. సమ్మెలో భాగంగా అంగన్వాడి కార్మికులు శిబిరం దగ్గర నుండి కాళీ ప్లేట్లు పట్టుకొని బిక్షాటన చేసుకుంటూ తహశీల్దార్ కార్యాలయం దగ్గర చేరుకుని ధర్నా చేసి అనంతరం తహశీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం ఇచ్చారు. అంగన్వాడీలకు మద్దతు ఇచ్చిన టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఆకె పోగు ప్రభాకర్, దండు సుందరరాజు, టౌన్ కన్వీనర్ గజేంద్ర గోపాలు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి వచ్చాక అంగన్వాడీలకు అన్యాయం చేస్తున్నాడని, తమ న్యాయమైన కోరికలు పరిష్కరించమని అంగన్వాడీల సమ్మెలో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఉపయోగించుకొని అంగన్వాడి సెంటర్ల తలాలు పగలగొట్టిచ్చిందని, ఇంతకన్నా దుర్మార్గం మరొకటి లేదని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు జే మోహన్, గఫూర్ మియా, కోడుమూరు మండల కార్యదర్శి జిపి వీరన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సుహాసిని, విజయభరతి, అరుణ, అనంతమ్మలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని అంగన్వాడీలు సమ్మెకు దిగితే ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఉపయోగించుకుని సెంటర్ తాలాలు పగల, కొట్టారని, అధికారులతో అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా సమ్మె విరమించే ప్రసక్తే లేదని తెలిపారు.

పత్తికొండ : అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేల ఇచ్చేంతవరకు పోరాటం చేస్తామని సిఐటియు మండల కార్యదర్శి గోపాల్ అన్నారు. శనివారం పత్తికొండలోని సచివాలయాలకు, ఎంపిడిఒ కార్యాలయానికి అంగనవాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, సిఐటియు నాయకులు తాళాలు వేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గోపాల్, అంగన్వాడి అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు శోభ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంగనవాడి టీచర్లకు ఆయాలకు ఇచ్చిన మాట ప్రకారం వేతనాలు, ఉద్యోగ భద్రత, పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. పద్మజ, షాజహాన్, మండల అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, సిపిఎం నాయకులు దస్తగిరి, ఆవాజ్ కమిటీ తాజ్ మహల్, మద్దికేర మండల కార్యదర్శి రాముడు పాల్గొన్నారు.

వెల్దుర్తి : వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల అంగన్వాడీ వర్కర్స్ 5వ రోజు కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, తెలంగాణ రాష్ట్రం కన్నా ఆదనంగా రూ1000 ఇస్తానని ,మాట ఇచ్చి ఇప్పుడు మాట తప్పి వారి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా అంగన్వాడి కార్యాలయాలకు తాళాలు పగులగొట్టడం దారుణమన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన -అంగన్‌వాడీనుద్దేశించి మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సామాజిక బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక బస్సు యాత్రను నేడు జయప్రదం చేయాలని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఏ.హాఫీజ్ ఖాన్ అన్నారు. ఈ మేరకు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోవైఎస్.జగన్మోహన్ రెడ్డి చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలకు వివరించేందుకు ఆదివారం కర్నూలు నగరంలోని పాత బస్టాండ్ వద్ద ్ర అంబేద్కర్ విగ్రహం నుంచి పూల బజార్ వరకు భారీ ఎత్తున ర్యాలీని బస్సు యాత్రకు సంఘీభావంగా నిర్వహించ నున్నామన్నారు. ఈ మేరకు 6 గంటలకు పూలబజారు వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశామని, పెద్ద ఎత్తున ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు వైసిపి నాయకులు. కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

బిసిల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యం: టిడిపి భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

బిసిల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమవుతుందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. శనివారం మౌర్య ఇన్‌లో టిడిపి వీరశైవ సాధికార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బిసి భరోసా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను టిజి భరత్ ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వీరశైవ సాధికార కమిటీ నేతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిస్తేనే ప్రజలకు భవిష్యత్తు ఉంటుందన్న ప్రధాన అంశాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వీరశైవ కమిటీతో పాటు ఇతర కమిటీలు ముందుకు వచ్చి స్వతహాగా కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాష్ట్ర వీరశైవ సాధికార కమిటీ కన్వీనర్ శివరాజు మాట్లాడుతూ కర్నూల్లో టి.జి భరత్ గెలిస్తే నగరం బాగుపడుతుందన్నారు. ప్రజలకు మంచి భవిష్యత్తు కావాలంటే టిడిపిని గెలిపించుకోవాలన్నారు. నగర అధ్యక్షుడు

వైసిపి పాలనను అంతమొందించాలి : గౌరుచరిత

ప్రజాశక్తి - కర్నూలు హాస్పటల్

రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలనను అంతమొందించాలని, రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని పాణ్యం ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 29వ వార్డ్ ఘట్టయ్య నగర్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా పాణ్యం నియోజకవర్గ మహిళ కమిటీ నిర్వహించారు. మహిళలతో రచ్చబండ, కాలనీలో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మెనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జి కె.శ్రీనివాసరావు, నంద్యాల పార్లమెంటు మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, నియోజకవర్గ తెలుగు అధ్యక్షుడు జవాజి గంగాధర్ గౌడ్, జిల్లా కార్యదర్శి కేతురు మధు, అర్బన్ నాయకులు ధనుంజయ, జయన్న, రాఘవేంద్ర, రామకృష్ణ, గోవిందు, మహిళలు సుశీల, లక్ష్మీదేవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మెడికవర్ హాస్పిటల్ నూతన సంవత్సరపు క్యాలెండర్‌ని కర్నూలు జిల్లా ఎస్‌పి జి. కృష్ణకాంత్ మెడికవర్ హాస్పిటల్స్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డితో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ నీలా రెడ్డి, మార్కెటింగ్ హెడ్ ఖాదర్ బాషా పాల్గొన్నారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలు, పరికరాలు అనుభవజ్ఞులైన డాక్టర్స్ కలిగి అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ వారు నూతన సంవత్సరపు మొదటి క్యాలెండర్‌ను తమ చేతుల మీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. మెడికవార్ హాస్పిటల్స్ యాజమాన్యం ఎన్నో మెరుగైన సేవలను అందించాలని కోరారు. అనంతరం క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ క్యాలెండరును ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. అత్యాధునిక సదుపాయాలు, పరికరాలు, అనుభవజ్ఞులైన డాక్టర్స్, 24/7 ఎమర్జెన్సీ వైద్య సేవలు, అంబులెన్సు సదుపాయాల వల్ల పేషెంట్స్ క్లిష్టమైన స్థితిలో వారిని కాపాడుతున్నామని అన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

‘కౌలుట్ల’ అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో కొలువైన శ్రీకౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధి నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరామ్ సోదరుడు, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ స్వామి శనివారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరై ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయ శాఖ కింద చేపట్టనున్న రూ.1.20 కోట్ల ఆలయ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేంద్ర రెడ్డి, ఆలయ ఇఒ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతు రెడ్డి, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త రామాంజనేయులు, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, వైసిపి మండల నాయకులు హంపి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నిజాలురెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, నారాయణరెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, రామచంద్ర, కృష్ణ, నారాయణ, కబీర్, మద్దిలేటి, పెద్ద లింగన్న, రామాంజనేయులు, ఆలయ సిబ్బంది శ్రీనివాసులు, సురేష్, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సోదరుడు

పేదలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పేదలను లక్షాధికారులను చేయడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని బసాపురం గ్రామంలో రెండో రోజూ ‘గడపగడపకు మన ప్రభుత్వం’ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతికి తావు లేకుండా బసాపురం, కొండాపురం గ్రామాల లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.24,87,12,000 నేరుగా ప్రజల అకౌంట్లో జమ చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సర్పంచి ఈరమ్మ, వీరేష్, ఎంపిటిసి శశిధర్ రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, నవీన్ రెడ్డి, వినోద్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి ఆనంద్, ఈరన్న పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి

టిబి రోగుల దత్తతకు ముందుకు రావాలి

- లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి - ఆదోని

టిబి రోగులను దత్తత తీసుకునేందుకు దాతలు ముందు రావాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్, టిబి ఆఫీసర్ షేకూన్ బాను కోరారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఆదోనిలోని టిబి కేంద్రంలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోషకాహార కిట్లను 34 మంది పేద రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోషకాహారం తీసుకుని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. దాతలకు భారత ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు. రీజియన్ ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, ఈసీ మెంబర్లు వనపరాజు, డాక్టర్ ఉషా రావు, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ బాల మురళీ కృష్ణ, టిబి స్టాఫ్ బాబు రాజు, మనోరంజిని, మేరీ జ్ఞానేశ్వరి, వీరేష్, సుబ్బమ్మ బాయ్ పాల్గొన్నారు.

రోగులకు కిట్లను పంపిణీ చేస్తున్న సభ్యులు

అథ్లెటిక్స్ పోటీల్లో రావూస్ జయభేరి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో గురు, శుక్రవారాల్లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 10 పతకాల పంట పండించారు. 4×100 మీటర్ల రిలేలో విజయ్, ఉపేంద్ర, హరన్, జయశంకర్ రెండో స్థానం సాధించగా, 4×100 మీటర్ల రిలేలో నందిని, రేఖ, పద్మావతి, జ్యోతి మూడో స్థానం సాధించారు. 800 మీటర్ల సింగిల్ ఈవెంట్‌లో ఉపేంద్ర రెండో స్థానం, 100 మీటర్ల సింగిల్ ఈవెంట్‌లో నందిని మూడో స్థానం సాధించారు. ఈ అథ్లెటిక్స్ పోటీల్లో రిలే 8 పతకాలు, సింగిల్ ఈవెంట్‌లో 2 పతకాలు సాధించారు. తమిళనాడు రాష్ట్రంలోని తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ తిరువారుర్‌లో జరిగే రాష్ట్రస్థాయి సౌత్ జోన్ ఖోఖో పోటీలకు నందిని, రేఖ, పద్మావతి ఎంపికైనట్లు రావూస్ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. వ్యాయామ అధ్యాపకులు ధనుంజయ, గోవిందు సంతోషం వ్యక్తం చేశారు.

ఎంపికైన విద్యార్థులతో రావూస్ అధ్యాపకులు

సమస్యలు పరిష్కరించాలని

అంగన్వాడీల భిక్షాటన

ప్రజాశక్తి - ఆదోని

తమ సమస్యలు న్యాయమైనవని, పరిష్కరించకుండా సహనాన్ని పరీక్షించవద్దని అంగన్వాడీలు హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. రోజురోజుకు వివిధ రూపాల్లో అంగన్వాడీలు జనాల మద్దతు కూడగట్టుకుంటూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. శనివారం ఆదోని పట్టణంలో దుకాణాల ముందు భిక్షాటన చేస్తూ అంగన్వాడీలు నిరసన చేపట్టారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని కోరుతున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ తెలిపారు. పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తామని చెప్పారు. తమ పట్ల కనికరం చూపకుండా సెంటర్లకు తాళాలు పగులగొట్టి ఓపెన్ చేయించడం సమంజసం కాదన్నారు. ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ఎన్ని కుయుక్తులు చేసినా ముందుకు సాగుతామని హెచ్చరించారు. మున్సిపల్ రోడ్డు, భీమాస్ సర్కిల్, పిఎన్.రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా భిక్షాటన చేపట్టారు. నాయకులు వరలక్ష్మి, జానకి, శారద, పద్మ ఉన్నారు. **ఆలూరు** బస్టాండ్ ఆవరణలో అంగన్వాడీలు భిక్షాటన చేసి అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. 5వ రోజు చేపడుతున్న నిరవధిక సమ్మెలో కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఆలూరు అసెంబ్లీ కో ఆర్డినేటర్ చిప్పగిరి లక్ష్మీనారాయణ పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, హాలహర్వి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు దేగులపాడు మంజునాథ్, వినోద్ కుమార్, ఎంఆర్‌పిఎస్ హాలహర్వి మండల కార్యదర్శి గూళ్యం ఎల్లప్ప, వరకుమార్, రాంబాబు మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు బాల రంగమ్మ, భారతి, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సమ్మె టెంట్ దగ్గర నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ భిక్షాటన చేస్తూ సమస్యలను విన్నవించారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, ఉపాధ్యక్షులు బాలకృష్ణ, రైతుసంఘం జిల్లా సహాయక కార్యదర్శి హనుమంతు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు నాగేంద్ర, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి, సిపిఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు మల్లేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, సరోజమ్మ, ప్రమీల, విజయలక్ష్మి, పద్మ, రాధ, విశ్వకుమారి, చిట్టెమ్మ, శ్రీదేవి, గీతావాణి పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని ప్రాజెక్టు కార్యాలయం వద్ద గడ్డి తింటూ నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు విశాలాక్షి, అంగన్వాడీలు ఫాతిమా, భీమేశ్వరి, ఉమామహేశ్వరి, ప్రమీల, సిఐటియు నాయకులు ఆంద్రయ్య, కెవిపిఎస్ నాయకులు బి.అనిల్, ధర్మ, అంజి పాల్గొన్నారు. **కోసిగి**లో వైఎస్‌ఆర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు హెప్సిబారాణి, లూసమ్మ, వరలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, కాంగ్రెస్ నాయకులు లోకేష్, నరసింహులు, రైతుసంఘం మండల కార్యదర్శి వీరేష్ మాట్లాడారు. **ఎమ్మిగనూరు**లో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, అడ్వకేట్ లక్ష్మీనారాయణ రెడ్డి, సిపిఐ ఎంఎల్ కార్యదర్శి కె.రాజు మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శులు బి.గోవర్ధనమ్మ, ఎస్.నాగలక్ష్మి, కృష్ణవేణి, శిరోమణి, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి వి.తిమ్మరాజు, ఐఎఫ్‌టియు డివిజన్ కార్యదర్శి కె.ప్రసాద్, నీరజ, నాగేశ్వరమ్మ, శైలజ, తులసి, వెంకటేశ్వరమ్మ, జయమ్మ, హేమలత, త్రివేణి, బసమ్మ, వెంకటలక్ష్మి, గౌసియా, శంషాద్ బేగం, జయమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు.

ఆస్పరిలో ర్యాలీగా వెళ్లి భిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు

ఎమ్మిగనూరులో మద్దతు తెలుపుతున్న లక్ష్మీనారాయణ రెడ్డి

ఆదోనిలో భిక్షాటన చేస్తున్న జిల్లా కార్యదర్శి వెంకటమ్మ

ఆలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

టిడిపి తాలూకా అధ్యక్షులుగా చిన్న మారెప్ప

ప్రజాశక్తి-హాలహర్వి

టిడిపి తాలూకా అధ్యక్షులుగా హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన కురువ చిన్న మారెప్పను అధిష్టానం ఎంపిక చేసింది. శనివారం ఆయన మాట్లాడారు. తనను టిడిపి తాలూకా అధ్యక్షులుగా ఎంపిక చేసినందుకు మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జ్ కోట్ల సుజాతమ్మ, టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణను జగన్ రెడ్డికి భయం పట్టుకుందని తెలిపారు. ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబును కోరుకుంటున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.

కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఉద్యమం

- బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణమోహన్

ప్రజాశక్తి-ఆలూరు

మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఉద్యమం తప్పదని మాదాసి, మాదారి కురువ సంఘం రాష్ట్ర నాయకులు, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణమోహన్ తెలిపారు. శనివారం ఆమె మొలగవల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కురువలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యం వల్లే కురువలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కురువలకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొర్రెల, మేకల పెంపకందారులకు వయో పరిమితి లేకుండా రూ.10 లక్షల జీవన బీమా పథకం అమలు చేయాలని కోరారు. ఈనెల 24 ఆలూరులో జరిగే కురువ మహాగర్జనను జయప్రదం చేయాలని కోరారు. మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు రామ్మోహన్, దేవేంద్రప్ప, మాణిక్య రెడ్డి, తిమ్మప్ప, హనుమప్ప, వెంకట రాముడు, రాజు, మురళీ పాల్గొన్నారు.

మొలగవల్లిలో మాట్లాడుతున్న శశికళ కృష్ణమోహన్

పౌర హక్కులను హరిస్తున్న వైసిపి

- అంబేద్కర్ విగ్రహానికి బీసీవై వినతి

ప్రజాశక్తి - ఆదోని

రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను పోలీసులను అడ్డుపెట్టుకొని హరిస్తున్నారని బీసీవై నాయకులు మండిపడ్డారు. ‘అంబేద్కరా ప్రజాస్వామ్యాన్ని కాపాడరా’ అంటూ బీసీవై జిల్లా సమన్వయ సారథులు కె.నరేంద్ర యాదవ్, బి.హరీష్, అక్బర్, హరి కోరారు. శనివారం ఆదోనిలోని శ్రీనివాస భవన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీసీవై అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ తలపెట్టిన ‘రైతుభేరి’ని స్థానికంగా ఉన్న నాయకులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి పోలీసు వ్యవస్థను ఉపయోగించి అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వం సరిగా పని చేయకపోయినా, అభివృద్ధి చేయకపోయినా ప్రశ్నించే హక్కు ప్రతి పౌరునికీ ఉందని తెలిపారు. ప్రశ్నిస్తున్న వారిపై దాడులు చేయడం, అక్రమంగా కేసులు పెట్టడం, ఇబ్బందులకు గురిచేయడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. మహిళలను అక్రమంగా అరెస్టు చేసి, ఎఫ్ఐఆర్ లేకుండా రాత్రి 12 గంటల వరకు స్టేషన్‌లో ఉంచడం హేయమైన చర్య అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వేచి వేచి... పిలిచి పిలిచి..

- సర్వసభ్య సమావేశం జరిపిన అధికారులు

ప్రజాశక్తి - కౌతాళం

కోరం లేక.. ప్రజాప్రతినిధులు సరైన సమయానికి రాక... వేచివేచి.. పిలిచి పిలిచి సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి కోసం మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. అధికారులు వేచి వేచి.. ఫోన్ చేసి ఎంపిటిసిలను పిలిచి పిలిచి సమావేశం నిర్వహించాల్సిన పరిస్థితి శనివారం కౌతాళం ఎంపిడిఒ సుబ్బరాజుకు ఎదురైంది. శనివారం ఉదయం 11 గంటలకు సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు వారం రోజుల క్రితం మండల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు, అన్ని శాఖ అధికారులకు సమాచారం అందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు హాజరైనా 12 గంటల వరకూ చాలామంది ఎంపిటిసిలు హాజరు కాకపోవడంతో కోరం లేక వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంపిడిఒ సుబ్బరాజు ఫోన్ ద్వారా ఎంపిటిసిలందరినీ పిలిపించి 12.30 గంటలకు సమావేశాన్ని ప్రారంభించాల్సి వచ్చింది. ఎంపిపి అమ్రేష్ అధ్యక్షతన సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుబ్బరాజు మాట్లాడారు. సమయపాలన పాటించి ఎంతో విలువైన సమయాన్ని ఆదా చేయాలని కోరారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను రెండు రోజుల ముందే అందించాలని తెలిపినా ఏ అధికారి కూడా స్పందించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. అధికారులు ప్రగతి నివేదికలు అందిస్తే స్థానిక ఎమ్మెల్యేకు, ఎంపిపి, వైస్ ఎంపిపిలు, కో ఆపరేటివ్ సభ్యులకు అందించాల్సి ఉంటుందని తెలిపారు. ఏ అధికారి కూడా ప్రగతి నివేదికలు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు సమావేశాల నుంచి అన్ని శాఖల అధికారులకు తెలుపుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. అధికారులు పద్ధతి మార్చుకొని సహకరించాలని కోరారు. అనంతరం వ్యవసాయ, విద్య, వైద్యం, ఉపాధి, తదితర శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వివరించారు. కౌతాళం సర్పంచి పాల్ దినకరన్ మాట్లాడుతూ... భారతదేశ సైన్యంలో పని చేసి విరమణ పొందిన వారికి ప్రభుత్వపరంగా అందించే పథకాలను అందించాలని కోరారు. రౌడూరు గ్రామంలో నాడు-నేడు అభివృద్ధి పనులకు సిమెంట్ కొరత ఉందని, సమస్యను పరిష్కరించాలని మండల ఉపాధ్యక్షులు లిఖిత సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడంతో సప్పగా సాగింది. మండల ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి, లిఖిత, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఎఒ శేషాద్రి, పిఆర్ ఎఇ శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్ ఎఇ నరసయ్య, వైద్యాధికారి ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సమాచారం అడిగినా ఇవ్వని అధికారులు

- నాలుగు నెలలుగా పట్టించుకోకపోవడంతో ఉన్నత అధికారులకు ఫిర్యాదు

- బిల్లేకల్లు మాజీ ఎంపిటిసి జగన్మోహన్ బాబు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు పంచాయతీకి సంబంధించిన సమాచారాన్ని అడిగి 4 నెలలు కావస్తున్నా అధికారులు ఇవ్వడం లేదని బిల్లేకల్లు మాజీ ఎంపిటిసి జగన్మోహన్ బాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిల్లేకల్లు పంచాయతీకి సంబంధించి 2019 నుంచి 2023 వరకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను, వాటి వినియోగంపై సమాచారం అడిగామని తెలిపారు. ఆగస్టులో తాము సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శి స్పందించడం లేదన్నారు. ఎన్నిసార్లు అడిగినా దాట వేట ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలిపారు. నెల రోజుల్లో సమాచారం ఇవ్వాల్సిన అధికారులు స్పందించకపోవడంతో ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శిపై సమాచార శాఖ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మండలంలోని పరిస్థితులపై ఎస్ఐ వరప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కేసుల పురోగతిపై సమీక్షించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాలపై నిఘా ఉంచాలని ఎస్ఐని ఆదేశించారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగించినా, కర్ణాటక మద్యం, సారాయి, పేకాట, మట్కా ఆడినా, రాసినా తమ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

గ్రామాల్లో సెక్షన్ 30 అమలు

- ఎస్ఐ కిరణ్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం పోలీసు స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో సెక్షన్ 30 అమలులో ఉన్నట్లు ఎస్ఐ కిరణ్ బాబు తెలిపారు. శనివారం ఆయన పోలీసు స్టేషన్‌లో మాట్లాడారు. తమ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఎలాంటి సభలూ, సమావేశాలూ, ఊరేగింపులూ అనుమతి లేకుండా నిర్వహించరాదని తెలిపారు. డీఎస్పీ సీతారామయ్య ముందస్తు అనుమతి పొందాలని, లేకపోతే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కార్యదర్శిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎంపిడిఒకు పంచాయతీ కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని జిల్లేడుబుడకల పంచాయతీ కార్యదర్శి శివశంకర్ సింగ్‌పై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. శనివారం ఎంపిడిఒ గౌరీ దేవి, ఇఒఆర్‌డి సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు జి.రాముడు, నాగార్జున, ఆంజనేయులు, టి.రాముడు మాట్లాడారు. విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శి పట్ల దురుసుగా ప్రవర్తించి, చేతితో దాడి చేయడం విచారకరమన్నారు. ఈ దాడిపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిపై ఎవరైనా దాడి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

షేక్ సాబ్జీ మృతి బాధాకరం

- యుటిఎఫ్ సంతాపం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి బాధాకరమని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.నాగమణి, జె.ఎల్లప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.దావీదు, జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు తెలిపారు. శనివారం యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1989లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన షేక సాబ్జీ 90లో యుటిఎఫ్ సభ్యునిగా సభ్యత్వం స్వీకరించారని తెలిపారు. ఉపాధ్యాయ సంఘం నిర్మాణానికి, అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. అంగన్వాడీ ఉద్యమానికి సంఘీభావం తెలిపి ఆశావర్కర్ల సమ్మెలో పాల్గొనడానికి వెళ్తూ దురదృష్టవశాత్తు మృతి చెందడం బాధాకరమన్నారు. **గోనెగండ్ల** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగభూషణం ఆధ్వర్యంలో షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు షేక్ సాబ్జీ మృతి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమానికి తీరని లోటని యుటిఎఫ్ నాయకులు గుమ్మల బాబు, తాజుద్దీన్, ఉమా తెలిపారు. ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ఉస్మాన్, రంగస్వామి, రామచంద్రరావు, షఫీ, ఖాదర్ బాష, రంగమ్మ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో సంతాపం తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

జాతీయస్థాయి క్రీడాకారులకు ఆర్థిక సాయం

- జార్ఖండ్, అండమాన్ నికోబార్ జాతీయస్థాయి పోటీలో సత్తా చాటాలి

- ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వహాబ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వహాబ్ ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణానికి చెందిన మాచాని సోమప్ప బాలికల పాఠశాల విద్యార్థిని సౌమ్య జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు, దీక్ష కళాశాల విద్యార్థి ఈశ్వర్ కేంద్ర పాలిత ప్రాంతం అండమాన్ నికోబార్‌లో జరిగే అండర్-17 ఫుట్ బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వైఎఫ్‌సి ఆధ్వర్యంలో క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందిస్తూ ట్రాక్ స్యూట్, స్టడ్ షూస్, క్యాప్స్, స్టాకింగ్స్‌ను ఉచితంగా అందజేశారు. అనంతరం ప్రిన్స్ వహాబ్ మాట్లాడారు. పోటీల్లో సత్తా చాటి ఎమ్మిగనూరుకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రతిభకు పేదరికం అడ్డుకారాదని ఆర్థిక సహాయం అందించామన్నారు. సీనియర్ క్రీడాకారులు విజేత నాగరాజు, విశ్వనాథ్, రమేష్, సర్తాజ్, శేఖర్, ఓంకార్, రఘు, గుడికల్ వంశీ, పాల వీరేష్, తారక్, శివ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న వహాబ్

ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ తిమ్మన్న మృతి

- పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - గోనెగండ్ల

కర్నూలులో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెలికాస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గోనెగండ్లలోని ఎస్సీ కాలనీకి చెందిన తిమ్మన్న అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియల నిమిత్తం ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన గోనెగండ్లకు తరలించారు. శనివారం కర్నూలు నుంచి వచ్చిన ఆర్ఐలు బి.రమేష్, రామ మహేశ్వరరెడ్డి, హుస్సేన్‌తో పాటు గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి సమక్షంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గోనెగండ్ల ఎస్సీ కాలనీకి చెందిన పి.తిమ్మన్న (53) 1994లో ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. 2009లో ఎఆర్ విభాగంలోకి మారి ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్‌గా, తుగ్గలి నాగేంద్రకు సెక్యూరిటీ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య రత్నమ్మ, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా, ఇంకా ముగ్గురికి వివాహం చేయాల్సి ఉంది. తిమ్మన్న పాఠశాల స్థాయి నుంచి కబడ్డీ క్రీడల్లో రాణిస్తూ గుర్తింపు పొందారు. తిమ్మన్న ఆకస్మిక మృతితో గ్రామస్తులు, ఆయన సహచరులు, మిత్రులు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

తుపాకులు పేల్చి వందనం సమర్పిస్తున్న పోలీసులు

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

- 18న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

- ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.శివలక్ష్మి, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మిగనూరులో ఆశావర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశావర్కర్ల డిమాండ్ సాధన కోసం ఈనెల 18న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. ఆశాలకు పని భారం తగ్గించాలని, గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం కల్పించాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రాష్ట్రవ్యాప్తంగా పని ఒత్తిడితో మృతి చెందిన 8 మంది ఆశాల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు విశాలాక్షి, నాగవేణి, కృష్ణవేణి, ఈరమ్మ, రహింబీ, మార్తమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో మండలంలోని దొడ్డనకేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.శివ జ్యోత్స్న ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటస్వామి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 12 నుంచి 14 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ మీట్‌లో విద్యార్థులు కె.శివ జ్యోత్స్న, కె.నవేశ్వరి, జి.శైలజ, కె.శివశంకర్, బిజి.వినోద్, సి.నీలకంత, ఈ.శైలజ పాల్గొన్నారని తెలిపారు. కె.శివ జ్యోత్స్న 3 వేల మీటర్ల రేస్ వాక్‌లో 3వ స్థానంలో నిలిచారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో పాల్గొని పతకాలు సాధించినందుకు విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు తాయప్ప, జిలాని, రాజేశ్వరి, సాయిబాబా, భోజరాజు, లక్ష్మీకాంత్, నాగలక్ష్మి, వేణుగోపాల్, మనోహర్, సరస్వతి, రాజశ్రీ, షేక్షావలీ, నాగన్న, రేణుకాబాయి, రామ్మోహన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ఓబన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ఆరేకల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండలం ఆరేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాజు నంద్యాలలో 11 నుంచి 14 వరకు జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించారని ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం తెలిపారు. శనివారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమన్నారు. భవిష్యత్తులో రాజు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. రాజును, తర్ఫీదు వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు విజయ సుశీలను అభినందించారు.

నేటి నుంచి పెన్‌డౌన్

- 20 నుంచి సమ్మెకు సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి - కౌతాళం

రెగ్యులైజేషన్, వేతనాల పెంపు, బకాయిల చెల్లింపు తదితర సమస్యలను ప్రభుత్వం తీర్చకపోవడంతో శనివారం నుంచి పెన్ డౌన్ నిరసన చేపడుతున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు తెలిపారు. మండలంలోని ఎంఇఒకు వారు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 20 నుంచి సమ్మెలో పాల్గొంటామని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు 3 నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

విద్యుత్ పొదుపు సామాజిక బాధ్యత

- విద్యుత్ శాఖాధికారులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విద్యుత్ పొదుపు సామాజిక బాధ్యత అని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్ కుమార్ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డివన్ ఎఇ నాగభూషణం పాల్గొన్నారు.

‘క్రీడలతో స్నేహభావం పెంపు’

ప్రజాశక్తి - ఆదోని

క్రీడలు ఆయా ప్రాంతాల క్రీడాకారుల మధ్య స్నేహభావం, ఔన్నత్యాన్ని పెంపొందిస్తాయని ఫిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా కుప్పగల్‌లో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు శనివారం ట్రోఫీలు అందజేశారు. 30 జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌లో మొదటి, రెండు, మూడు స్థానాలను ప్యాపిలి, కుప్పగల్, ఆదోని ఫిలిప్స్ జట్లు కైవసం చేసుకున్నాయి.

ప్రకటన

ఇందుమూలముగా వెల్దుర్తి గ్రామము, కర్నూలు జిల్లా ప్రజలకు తెలియజేడం ఏమనగా మా క్లైయింటు అయిన సి. జైనాష్టీన్ భర్త బి.సురేష్ వెల్దుర్తి గ్రామం మరియు మండలము కర్నూలు జిల్లా, వీరు సుమారు గత 10 రోజుల క్రితం కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి గ్రామములో తన పాత ఇంటి నుండి ఇందిరానగర్‌లోని మరో ఇంటిలోకి చేరు సందర్భంలో సామన్లు, ఫర్నిచర్‌ను మారుస్తుండగా మా యొక్క చెక్కు బుక్కు నెం.31093159937 అందులోని 13 చెక్కు పేపర్లు సిరియర్ నెంబర్లు (1).635881 (2).635893 (3).635901 (4).635904 (5).635909 (6).635916 (7).635917 (8).635918, (9).635919 (10).635920 (11).635921 (12).635922 (13).635929. తప్పిపోయినవి వీటి కోసం ఎంత వెతికిన దొరకలేదు. ఈ విషయంపైన వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో 1-12-2023 వ తేదిన ఫిర్యాదు చేయటం జరిగింది. ఈ చెక్కులు ఎవరికైన దొరికిన అవి చెల్లవని తెలియజేయు చున్నాము. కావున దయఉంచి పైన కనబరచిన చెక్కు పేపర్లు ఎవరికైన దొరికిన నాకుగాని నాక్లైయింటుకుగాని క్రింది సెల్ నెంబరుకు కాల్ చేసి తెచ్చి ఇవ్వగలరని మనవి.

సి.విజమ్‌కుమార్,
అడ్వకేటు,
నందికొట్కూరు
సెల్.నెం.9989884402

ఉత్సాహంగా ఆరంభం..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఉత్సాహంగా ఆరంభం అయ్యాయి. ఈ సందర్భంగా కర్నూలు నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీలో కర్షక లోకం కదం తొక్కింది. ఉదయం సత్య ఇన్ రెసిడెన్సీలో శంకరయ్య నగర్ వేదికగా ప్రతినిధుల సభ ప్రారంభం అయ్యింది. ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే పతాక ఆవిష్కరణ చేశారు. నాయకులు, కౌన్సిల్ కమిటీ సభ్యులు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే అధ్యక్ష ఉపన్యాసం చేశారు. మధ్యాహ్నం భారీ ర్యాలీ నిర్వహించారు. సుందరయ్య సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీరామ్ థియేటర్, మౌర్య ఇన్, రాజ్ విహార్, కిడ్స్ వరల్డ్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ మీదుగా పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ క్రిష్ణన్ ర్యాలీ అగ్ర భాగాన నిలిచి ముందుకు నడిపించారు. ర్యాలీలో రైతులు ఎర్ర కండువాలు, ఏఐకేఎస్ జెండాలతో ర్యాలీ ఆద్యంతం ఎరుపెక్కింది. అత్యంత క్రమశిక్షణతో రైతు సంఘం నినాదాలు చేస్తూ అత్యంత ఉత్సాహంగా ముందుకు కదిలారు. ర్యాలీకి ముందు భాగాన స్వాగతం పలుకుతూ ఎపి డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన డప్పుల దరువు నృత్యంతో నగరం దద్దరిల్లింది. ర్యాలీలో ముందు భాగంలో ఎర్ర దుస్తులు ధరించిన వాలంటీర్లు కవాతుతో ఘన స్వాగతం పలికారు. వెంకటేష్ థియేటర్ సమీపంలో యుటిఎఫ్ నాయకులు సంఘీభావాన్ని తెలియజేస్తూ పూలవర్షంతో ర్యాలీకి స్వాగతం పలికారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా రైతాంగంలో భారీ ఎత్తున చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిలించేలా రైతుల ప్రదర్శన కొనసాగింది. ర్యాలీ అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు.

అంగన్వాడీల సమ్మె ఉధృతం

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఉధృతం చేశారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు మొదలు పెట్టింది. సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టే పనికి పూనుకుంది. దీనిపై అంగన్వాడీల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా తమ సమస్యలు సాధించుకునే వరకూ సమ్మె ఆగదని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచి ఇస్తామన్న వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

కళ్లకు గంతలతో నిరసన

- ఐదో రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

- టిడిపి, జనసేన, ప్రజా సంఘాలు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి సంఘీభావం

నంద్యాల జిల్లాలో అంగన్‌వాడీల సమ్మె ఐదో రోజు శనివారం కొనసాగింది. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, పాణ్యం, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లోని అంగన్‌వాడీలు కళ్లకు నల్ల రిబ్బన్‌లు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లకు వెళ్లి అంగన్వాడీ సెంటర్ల తాళాలు, తలుపులు పగలగొట్టిన వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. అంతకు ముందు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నందికొట్కూరులో అంగన్‌వాడీల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మద్దతు తెలియ జేస్తూ పాల్గొన్నారు. అలాగే టిడిపి, జనసేన, ప్రజా సంఘాల నాయకులు దీక్షలకు మద్దతు తెలియజేశారు. (వార్త 6వ పేజీలో..)

నంద్యాలలో కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

అంబేద్కర్ అంటే అందరివాడు

- ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ - కుల వివక్ష పోతేనే దళితుల అభివృద్ధి

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య, ఎస్సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - నంద్యాలరూరల్

ప్రపంచ మేధావి, నవ భారత్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ అందరి వాడని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు.జి చెన్నయ్య పేర్కొన్నారు. శనివారం నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎస్సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్యలు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జి.చెన్నయ్య, విక్టర్ ప్రసాద్, విగ్రహదాత నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే ఎక్కలదేవి ఐజయ్యలు మాట్లాడారు. దేశంలో కుల వివక్షతో దళితులు మగ్గుతున్నా రని గుర్తించి, సమాజంలో అంటరానితనాన్ని స్వయంగా అనుభవించి అణగారిన వర్గాల విముక్తి కొసం 1919 డిశంబర్ 25నుండి అంబేద్కర్ ప్రారంభించిన ఉద్యమాలు దశ దిశల వ్యాప్తి చెందాయని తెలిపారు. మనుస్మృతిని దహనం చేసి రూపుమాపే విప్లవానికి ఆజ్యం పోశారని అన్నారు. దేశంలో అసమానతలు తొలగించే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను అందించి, స్వేచ్ఛ, సమానత్వం, సోదరాబావంతో జాతి ఐక్యత సమగ్రత్తలను సమూలంగా పంచు కోవాలని చాటి చెప్పిన అంబేద్కర్ మార్గంను అందరూ అనుసరించా లన్నారు. కార్యక్రమంలో నాయకులు, పెద్ద కొట్టాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు 'భారత స్కౌట్స్ అండ్ గైడ్స్' : డిఆర్ఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొని క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్- 2023 నూతన కమిటీని డిఆర్ఒ బి.పుల్లయ్య, డిఇఒ సుధాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థకు ఎన్నికలు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయని, ప్రతి పాఠశాల సభ్యత్వం కోసం 300 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన ప్రతి విద్యార్థి విద్యార్థినులు మంచి క్రమశిక్షణతో పాటు ఉన్నత స్థాయి విద్య అభ్యసించే అవకాశం ఉందని, దీంతోపాటు చదువు, సంస్కారం అలవడుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రూప్ ప్రారంభించాలని కమిటీ ప్రతిపాదించిందని, స్కౌట్‌లో చేరిన విద్యార్థులకు ఐదు శాతం రిజర్వేషన్ ఉంటుం దన్నారు. స్కౌట్ మాస్టర్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు నిర్వహించాలంటే చాలా ఖర్చుతో కూడిన పని అని, ముఖ్యంగా ఆగస్టు 15 స్వాతంత్రదినోత్సవం, జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్కౌట్ విద్యార్థులకు నిర్వహణ ఖర్చు రూ. 40 వేల నుంచి 50 వేల వరకు అవుతుందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వివిధ సంస్థల యాజమాన్యం తోచిన కాంట్రి బ్యూషన్ అందిస్తే ఈ సంస్థ నిర్వహణకు దోహద పడినట్లు అవుతుందని తెలిపారు.జిల్లా సెక్రెటరీ తూర్పు లింగారెడ్డి తన ఆదాయంలో పది శాతం ఈ సంస్థకు కాంట్రి బ్యూషన్‌గా ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ బేగ్, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లియో ఆంటోనీ, చిన్నయ్య, స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్, స్కౌట్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

- నాలుగు తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు కర్నూలులోని ఎన్.శంకరయ్య నగర్ వేదికగా శనివారం రెండో రోజు కొనసాగాయి. రెండో రోజు నాలుగు తీర్మానాలకు జాతీయ కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టం తేవాలని, సమగ్ర పంటల బీమా అమలు చేయాలని, ఎరువుల మీద సబ్సిడీ కోత ఎత్తివేసి రాయితీలు కొనసాగించాలని, విద్యుత్ సంస్కరణల బిల్లును ఉపసంహరించుకోవాలని కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. జాతీయ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలను ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు టి.సాగర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ గతేడాది ఎఐకెఎస్ అఖిల భారత మహాసభ కేరళలోని త్రిసూర్‌లో జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకూ చేపట్టిన ఉద్యమాలను సమీక్షించామని తెలిపారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ఇవ్వాల్సిన భూములు ఇవ్వకుండా అటవీ సంరక్షణ చట్టానికి తూట్లు పొడిచేలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన దానిపై పోరాటాలు చేసేలా అన్ని సంఘాలతో కలిసి పోరాటాలు చేయాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. ఎగుమతులు, దిగుమతుల విషయంలో రైతాంగానికి ఉపయోగపడేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. కేంద్రం తన వైఖరి మార్చుకోకపోతే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేలా రాజకీయ నిర్ణయం తీసుకునేలా రైతులను సన్నద్ధం చేయాలని, సెమినార్లు, సదస్సులు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ సమావేశంలో 29 రాష్ట్రాల కౌన్సిల్ కమిటీ సభ్యులు మాట్లాడారని, కేంద్ర ప్రభుత్వ విధానాలు ఎలా రైతులకు నష్టం చేస్తున్నాయి, వాటిపై ఎలా పోరాడుతున్నారని చెప్పారన్నారు. పాడి రైతులకు బోనస్ ఇస్తామన్న ఇవ్వకపోగా పాల సేకరణ పేరుతో ప్రయివేటు కంపెనీలకు లీజుకు ఇస్తున్నారన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దానిపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. కరువు మండలాలను తక్కువగా ప్రకటించారని, ప్రకటించిన మండలాల్లోనూ కరువు సహాయక చర్యలు చేపట్టడం లేదన్నారు. అన్ని పంటలకూ ఎకరాకు రూ.6800 నష్టపరిహారం ఇవ్వాలనడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై ఈ నెల 21న రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాలుగా సచివాలయాలు, మండల స్థాయిల్లో ఆందోళనలు చేపట్టనున్నామని, ఈ ధర్నాల్లో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు. ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు సాగర్

ఉచిత వైద్య శిబిరం

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా సత్యా ఇన్‌లో సమావేశం జరుగుతున్న హాల్ ప్రాంగణం వద్ద మెడికల్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు ఎస్.ఖలీల్ అహ్మద్, ఏ.వెంకట్, కె.బసవరాజు లు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులకు వారికి కావలసిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరం ఆదివారం కూడా ఉంటుందని తెలిపారు.

వైద్య శిబిరం నిర్వహిస్తున్న మెడికల్ రెప్స్ నాయకులు

ఫ్లవర్స్ యాక్టివిటీ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

మాస్టర్ పబ్లిక్ స్కూల్లో ఫ్లవర్ యాక్టివిటీ ప్రోగ్రాం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని మాస్టర్ పబ్లిక్ స్కూల్లో ఫ్లవర్ ఆక్టివిటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు రకరకాల పుష్పాలతో పాఠశాలకు హాజరై అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ హాలిమా మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకను పెంపొందించాలనే ఉద్దేశంతో రకరకాల కార్యక్రమాలు చేయడంలో భాగంగా నేడు ఫ్లవర్ ఆక్టివిటీ కార్యక్రమం చేపటినట్లు తెలిపారు. ఫ్లవర్ ఆక్టివిటీ కార్యక్రమం ద్వారా రకరకాల పూలు, వాటి రంగుల గురించి విద్యార్థులకు ఒక అవగాహన ఏర్పడందని పేర్కొన్నారు.

వైసిపి ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శిగా అత్తార్ జాహిద్ హుస్సేన్

ప్రజాశక్తి - బనగానపల్లె

అత్తార్ జాహిద్ హుస్సేన్

బనగానపల్లె పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్ జాహిద్ హుస్సేన్‌ను వైసిపి ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. శనివారం అత్తార్ జాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ తనను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకునేందుకు సిఫార్సు చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి, వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డికి, నియమించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నంద్యాలలో ఘోర రోడ్డు ప్రమాదం

- లారీ, డిసిఎం వ్యాన్ ఢీ.. మధ్యలో ఆటో నుజ్జు నుజ్జు

- ఆటో డ్రైవర్, ప్రయాణికుడు మృతి - ఇద్దరికి తీవ్ర గాయాలు - వ్యాన్‌లో ఏడు గేదెలు మృతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణం రైతునగరం వెళ్లే దారిలో నూనెపల్లె ఫ్లైఓవర్ దిగగానే ట్రిబుల్ ఆర్ కిచెన్ హోటల్ ఎదురుగా శనివారం డిసిఎం వ్యాన్, లారీ ఢీ కొనగా మధ్యలో ఆటో చిక్కుకొని ఇద్దరు మృతి చెందగా, మరో మహిళ, చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. డిసిఎం వ్యాన్‌లో ఉన్న ఏడు గేదెలు మృతి చెందాయి. రెండు భారీ వాహనాల మధ్యలో చిక్కుకున్న ఆటో నుజ్జునుజ్జయింది. స్థానికులు, ట్రాఫిక్ సిఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు... నంద్యాల పట్టణంలోకి మధ్యాహ్నం రెండు గంటలకు భారీ వాహనాలకు అనుమతి ఉంది. ఆ సమయంలో ఓ లారీ పట్టణంలోకి వెళ్లేందుకు డ్రైవరు తిప్పుకుంటుండగా నంద్యాల నుండి సంతలో పశువులను కొనుక్కొని రైతునగరం వైపునకు పోయేందుకు డిసిఎం వ్యాన్ డ్రైవర్ వేగంగా నూనెపల్లె బ్రిడ్జి మీద అతివేగంగా వచ్చాడు. దీంతో రైతునగరం నుండి బనగానపల్లెకు చెందిన ఆటో పట్టణంలోకి వస్తుండగా రెండు లారీల మధ్య చిక్కుకుని నుజ్జునుజ్జయింది. బనగానపల్లెకు చెందిన ఆటో యజమాని భాస్కర్ ఆటోలో గాజుల ఇక్బాల్ తన భార్యను నంద్యాలలోని లైఫ్ హాస్పిటల్‌లో చూపించేందుకు వచ్చాడు. ఆటో ప్రమాదంలో ఆటో యజమాని భాస్కర్, గాజుల ఇక్బాల్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఇక్బాల్ భార్య గాజుల ఆఫ్రిన్, ఆఫ్రిన్ కూతురు అక్సాలను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే డిసిఎం వ్యాన్‌లో ఉన్న ఏడు బర్రెలు సైతం అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, డిసిఎం వ్యాన్ మధ్యలో నుజ్జు నుజ్జు అయిన ఆటో

మృతి చెందిన ఆటో డ్రైవర్ భాస్కర్, గాజుల ఇక్బాల్

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి ఉద్యమానికి తీరనిలోటు

- సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సాబ్జీ మృతి ఉద్యమాలకు తీరని లోటనే సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్సీ సాబ్జీ చిత్రపటానికి సిఐటియు నాయకులు, అంగన్వాడి వర్కర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, అంగన్వాడి ,ఆశా వర్కర్లు ,కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్సీ సాబ్జీ ఎన్నో ఉద్యమాలు చేశారని తెలిపారు. అంగన్వాడీల నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఎమ్మెల్సీ సాబ్జీ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేసి అనుమానాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి, సభ్యులు రమాదేవి, శశికళ మల్లేశ్వరి, వరలక్ష్మి, చంద్రకళ, పర్వీన్, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు. **యుటిఎఫ్ ఆధ్వర్యంలో.. :** పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యా లయంలో అధ్యక్షుడు ప్రతాప్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి జిల్లా సహా అధ్యక్షులు సత్య ప్రకాష్ పూల మాలలు వేసి నివాళు లర్పించారు. గౌరవా ధ్యక్షులు సుధాకర్, ఆర్థిక కార్యదర్శి విజయకుమార్, జిల్లా ఆడిట్ కన్వీనర్ యు దస్తగిరి, సతీష్, గోపాల్, మల్లికార్జున, సన్నన్న డేవిడ్, వీర కుమార్ రెడ్డి ఎస్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** సిఐటియు కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సాబ్జీ చిత్ర పటానికి అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు జి.షేభారాణి, మండల కార్యదర్శి ఎన్‌కె నాగలక్ష్మి నివాళులు అర్పించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మధు శేఖర్, సంజీవ నాయుడు, మహాలక్ష్మి, లక్ష్మీదేవి, దేవి, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు. **డోన్:** డోన్ పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన షేక్ సాబ్జీ చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. సీనియర్ ఉపాధ్యాయులు బాబు, వెంకటరమణ, శివప్రసాద్, సుబ్బారెడ్డి, రవిశేఖర్, వెంకటలక్ష్మి, రాధ, శ్రీని వాసులు, అల్లిపీరా, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, భూకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధుసూదన్ రెడ్డి, సుభాన్, శ్రీనివా సులు, బాబు, ఆది నారాయణ, సురేష్, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, హుస్సేన్ భాను,ముని రాజు,ప్రసాద్ రావు,మహేష్ పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** సుండిపెంటలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు మునిపాటి చిన్న మారెన్న, నాయకులు ఎం.మల్లికార్జున, నాగవేంకటేష్, పౌలయ్య, రంగస్వామి, హనుమంతరెడ్డిలు షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళు లర్పించారు.

బనగానపల్లె : నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

డోన్ : నివాళ్లులర్పిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కాషాయ రంగు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

'బాల అకాడమీ'లో కాషాయ రంగు కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో 'రంగులు-ప్రత్యేకతలు' కార్యక్రమంలో భాగంగా శనివారం కాషాయరంగు ఆక్టివిటీని చిన్నారులు, ఉపాధ్యాయ బృదం ఎంతో ఆసక్తికరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు కాషాయ రంగు దుస్తులు ధరించి, కాషాయ రంగు వస్తువులు, ఆహార పదార్థాలతో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎంజివి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలతలు మాట్లాడుతూ కాషాయ రంగు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద రోజుల పని దినాలు కల్పించాలి

ప్రజాశక్తి - రుద్రవరం : ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పని దినాలు కల్పించాలని ఉపాధి హామీ పథకం పీడీ రామచంద్ర రెడ్డి తెలిపారు. శనివారం రుద్రవరంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో ఉపాధి హామీ పథకం అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పని జరిగిన వెంటనే ఆ పనిపేరు, వర్క్ ఫైల్, నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. 100 పని దినాలను ప్రతి కుటుంబానికి కల్పించాలన్నారు. బ్యాంకులో అకౌంటు పని చేయకపోతే పోస్టల్ అకౌంటును తెరిపించి వారికి ఉపాధి వేతనాన్ని అందులో జమ చేయించాలన్నారు. సమావేశంలో ఏపీడి సాంబ శివరావు, ప్రోగ్రాం ఆఫీసర్ పరమేశ్వరుడు, ఎంపీడీవో మధుసూదన రెడ్డి, ఏపీవో ప్రతాప్, ఆళ్లగడ్డ, చాగలమర్రి రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాల ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిడి రామచంద్రారెడ్డి

ఆర్టీసీ డిఎంకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ అన్నారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో నందికొట్కూరు ఆర్టీసీ కాంట్రాక్టు స్వీపర్లతో కలిసి ఆర్టీసీ డి.ఎం నాగేశ్వరావుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సర్క్యులర్ ప్రకారం కాంట్రాక్టర్ జీతాలు చెల్లిం చడంలేదన్నారు. కార్మికులకు సంవత్సరానికి ఒక్కసారి పిఎఫ్, ఈఎస్ఐ, రసీదులు ఇవ్వాలన్నారు. కార్మికులకు జీతం ప్రతినెల 10వ తేదీలోపు కార్మికుల అకౌంట్లో జమ చేయాలన్నారు. ప్రతి నెలకు పెరిగే డీఏ, బకాయిలను అరియర్స్ రూపంలో కార్మికులకు చెల్లించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రూరల్ అధ్యక్ష కార్యదర్శులు సి నాగన్న, వడ్డే ఆంజనేయులు, ఆర్టీసీ స్వీపర్లు రామ సుబ్బమ్మ, లచ్చుమ్మ, నాగేంద్రమ్మ, రామకృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్లోక పాఠశాలలో 'క్రీడోత్సవ్-2023'

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని శ్లోక పాఠశాలలో శనివారం 'క్రీడోత్సవ్ – 2023' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పట్టణం నలువైపుల నుంచి మారథాన్ నిర్వహించి కొత్త బస్టాండ్ ప్రాంతానికి చేరుకోగా నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా 5 కె రన్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కుమారి షేక్ జఫ్రిన్ టెన్నిస్ జాతీయ అవార్డు–2020 గ్రహీత కుమారి రూబీనా బేగ్ లైఫ్ అచీవ్మెంట్ అవార్డు గ్రహీతలు విచ్చేసి, క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడల వలన కలిగే శారీరక మానసిక లాభాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠ శాల చైర్మన్ శ్రీధర్ రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్స్ కవితా, శ్రీదేవి రెడ్డి, బసి రెడ్డి డిగ్రీ కళాశాల డైరెక్టర్ రమేష్ రెడ్డి, రంజి క్రికెట్ ప్లేయర్ జాకీర్, శాప్ కో–ఆర్డినేటర్ శ్రీనాథ్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు శంకర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రావూఫ్, జానీ, రఘు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడోత్సవ్‌లో శ్లోక విద్యార్థులు

శోభా నాగిరెడ్డి సేవలు చిరస్మరణీయం

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నివాళులు అర్పిస్తున్న అఖిలప్రియ

దివంగత మాజీ ఎమ్మెల్యే శోభా నాగిరెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం శోభా నాగిరెడ్డి జయంతిని పరిస్కరించుకొని శోభా ఘాట్‌లో తన సోదరుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డితో కలిసి ఆమె శోభా నాగిరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో శోభా నాగిరెడ్డి గురించి తెలియని వారుండరని, ఆమె పుట్టినరోజును నియోజకవర్గంలో అన్నిచోట్ల జరుపుతున్నారని తెలిపారు. కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన భూమా దంపతులు అండగా ఉండేవారని, ఎంతో బలమైన క్యాడర్‌ను తమకు ఇచ్చారన్నారు. నారా లోకేష్ పాదయాత్ర మూడు వేల కిలోమీటర్లు తిరిగారని, ఈనెల 21వ తేదీన ఆయన పాదయాత్ర ముగుస్తుందని, ఆయనకు పెద్ద సంఖ్యలో వెళ్లి మద్దతు పలకాలన్నారు. ఆయన పాదయాత్ర మంచి మైలేజీ వచ్చిందన్నారు. నంద్యాల, ఆళ్లగడ్డలో అభివృద్ధి చేసేందుకు మంచి అవకాశం వస్తుందన్నారు. నారా లోకేష్‌కు అందరం మద్దతు పలకాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, టిడిపి నాయకులు నన్నేబై గారి జిలాన్, చింతకుంట రామ శేఖర్ రెడ్డి, నాగాంజనేయులు, సిద్ధి సత్యం తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి : స్థానిక మహబూబ్ టాకీస్ ఆవరణంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాష ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత కీర్తిశేషులు శోభ నాగిరెడ్డి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఎస్ అన్సర్ బాష మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో శోభమ్మ కుమార్తె మాజీ మంత్రి భూమా అఖిలప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్ర మంలో నంద్యాల జిల్లా మైనార్టీ సెల్ నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి కొలి మి మా బు షరీఫ్, గుత్తి నరసింహులు, క్లస్టర్ ఇంచార్జ్ ముల్లా అజీమ్, ముళ్ళ ఆలంశ గారి మౌలాలి, ముల్లా గఫార్, హనీఫ్, కొలిమి సోను, రియాజ్ నాగూర్ బాష, మక్బూల్, కొలిమి అష్రాఫ్, కొలిమి సాదాఫ్, రాజేష్ కాలేగాల వలి, జిలేబి షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

శోభ నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, మద్దయ్య

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని బలపాల పల్లె గ్రామానికి చెందిన పిక్కిలి ఆంజనేయులు డోన్ నియోజకవర్గం టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా, సీతారామపురం గ్రామానికి చెందిన పుల్లూరు మద్దయ్య మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా నియామకం అయ్యారు. బేతంచర్ల మండల కేంద్రంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎస్సీ సెల్ విభాగంలో ఎన్నికైన ఆంజనే యులు, మద్దయ్యలను డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నియమించారు. ఈ సందర్భంగా శనివారం నాడు నూతనంగా ఎస్సీ సెల్ నియోజకవర్గ మండల ఉపాధ్యక్షులుగా ఎన్నుకో బడిన ఆంజనేయులు, మద్దయ్యలు ధర్మవరం సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆదేశించిన కార్య క్రమాలలో చురుకుగా పాల్గొంటూ పార్టీ విజయానికి కృషి చేయాలని అని అన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన ఆంజనేయులు, మద్దయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ ఉన్నము ఎల్ల నాగయ్య, నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు తమపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను నిర్వర్తిస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, బేతంచర్ల మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, టిడిపి సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, పట్టణ సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం సుధాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, కాకర్ల తిరుమలేష్ చౌదరి, పోలూరు శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ వాణిజ్య ఉపాధ్యక్షుడు జావాజి వెంకటేశ్వర్లు, జీవన్ చౌదరి, రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబిన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిమెంట్ నగర్ రాముడు, కౌన్సిలర్ రాంగోపాల్, శ్రీపతి నాగరాజు, గోరంట్ల, కానాల అంజి, తదితరులు పాల్గొన్నారు.

నాయకులను అభినందిస్తున్న ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి

శ్రీ వివేకానంద విద్యా విహార్‌కు

జాతీయ ఈటీ టెక్ ఎక్సలెన్సీ అవార్డు

ప్రజాశక్తి - పాములపాడు

హైదరాబాదు హైటెక్ సిటీలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ కన్వెన్షన్ హాల్లో జరిగిన జాతీయస్థాయి బ్రెయిన్ ఫీడ్ ఎక్సలెన్సీ 2023–24 అవార్డుల ప్రధానోత్సవంలో శ్రీ వివేకానంద విద్యా విహార్ పాఠశాలకు నేషనల్ 4వ ఎడ్యుకేషన్ ఈ టీ టెక్ ఎక్సలెన్సీ అవార్డు లభించింది. హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కె 12 ఎడ్యుకేటర్స్ కాన్ఫరెన్స్ 2023 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎంవి. రామ చంద్ర రెడ్డి, హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామీ బోధమయనంద జీ, తెలంగాణ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ట్రస్మా జనరల్ సెక్రటరీ మధుసూదన్, ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్‌కు ఎడ్యుకేషన్ ఈ టీ ఎక్సలెన్స్ అవార్డును ప్రధానం చేశారు. ఈనెల 15, 16 తేదీల్లో జాతీయ స్థాయి బ్రెయిన్ ఫీడ్ ఆర్గనైజేషన్ నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో పలు రాష్ట్రాలకు చెందిన జాతీయ స్థాయి ప్రముఖ విద్యాసంస్థలు పాల్గొన్నాయి. ఈ మేరకు టాప్ 500 పాఠశాలలో మూడు విభాగాల్లో రూరల్ విద్యా విధానంలో నంద్యాల జిల్లాలో ఎంపిక చేయబడ్డ పాములపాడు మండలానికి చెందిన శ్రీ వివేకానంద విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు ఎక్సలెన్సీ 2023 అవార్డును అందించారు. అకడమిక్ రిజల్ట్స్, సైన్స్ ప్రాజెక్టుల నిర్వహణ, ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ఆక్టివిటీస్, ఎన్విరాన్మెంట్ వంటి అంశాల ప్రాతిపాదికన అవార్డులను ప్రధానం చేశారు. 2023 ఎక్సెన్స్ అవార్డుకి ఎంపిక అయిన పాములపాడు లోని వివేకానంద ఉన్నత పాఠశాల కరస్పాండ్ ఆర్ ఎస్ ఆర్ గోపాల్‌ను టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి, ఏపీ అప్పుస్మా వర్కింగ్ ప్రెసిడెంట్ పీవి రమణారెడ్డి, అప్పుస్మా రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లాల పుష్ప నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ బ్రెయిన్ ఫీడ్ సంస్థ అధినేత బ్రహ్మం, కొల్లారెక్స్ గ్రూప్ సీఈఓ మంజుల పూజ సరూఫ్, శ్రీ హరిణి మీడియా వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ నలిన రామలక్ష్మి, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్స్ మాల్కోల్సన్ పీపుల్స్ కంబైన్ ఇన్షిటివ్స్ ఫౌండర్, సీఈఓ తుమ్మల నాగప్రసాద్, కార్పొరేట్ బడ్జెట్ స్కూల్స్ విద్యా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సలెన్సీ అవార్డును అందుకుంటున్న శ్రీ వివేకానంద విద్యా విహార్ యాజమాన్యం

ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

లెప్రసీ కాలనీ సమస్యలను పరిష్కరిస్తాం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

లెప్రసీ కాలనీలోని ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శనివారం డోన్ పట్టణంలోని 6వ వార్డు నందు లేప్రసి కాలనీలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పర్యటించారు. కాలనీలోని ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భ ంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ కాలనీలో మంచినీటి సౌకర్యం,స్ట్రీట్ లైట్స్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. లెప్రసీ కాలనీలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామి రెడ్డిని చైర్మన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ లు కోట్రికే హరికిషన్,జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్లు కటిక వేణు,నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్,డిఈ రసూల్,ఏఈ సురేష్,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టిన అధికారులు

ప్రజాశక్తి - పగిడ్యాల

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేసి తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో దీక్ష చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంపీడీవో వెంకటరమణ, ఐఆర్‌డి నాగేంద్రయ్య, సర్పంచుల సహకారంతో సచివాలయ సిబ్బంది శనివారం వెళ్లి మండలంలోని అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి కేంద్రాలను తెరిచారు. సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కేంద్రాలను తెరిచి విధులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాన్ని తాళాలు పగలగొట్టుతున్న అధికారులు

కళ్లకు గంతలతో నిరసన

ఆళ్ళగడ్డ : మద్దతు తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు ఇరిగెల

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల కలెక్టరేట్ : అంగన్వాడీలకు కనీస వేతనం అమలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీని అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, కె.మహమ్మద్ గౌస్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, వెంకటలింగం, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీతలు మాట్లాడారు. ఐదు రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే నామమాత్రపు చర్చలు జరిపి మభ్యపెట్టాలని చూస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా దుర్మార్గంగా వ్యవహరిస్తూ అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కళ్ళు తెరిపించేలా ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ, జిల్లా నాయకురాలు నాగరాణి, ప్రసన్నతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు నంద్యాల మండలం, నంద్యాల అర్బన్ ప్రాజెక్టు ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు. **బనగానపల్లె :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం ఆగదని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంగన్వాడి వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మె ఐదవ రోజుకు చేరుకుంది. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎంపీడీవో కార్యాలయం నుండి పెట్రోల్ బంకు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి, సెక్టర్ లీడర్లు రమాదేవి, శశికళ, చంద్రకళ, మల్లేశ్వరి, వరలక్ష్మి, అనసూయ, పర్వీన్, తులసమ్మ, సుకన్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరంలో అంగన్వాడీల దీక్షలు 5వ రోజు కొనసాగాయి. ఈ దీక్షకు మద్దతుగా టిడిపి నాయకులు భూమా విఖ్యాత్ రెడ్డి, మండల నాయకులు బాచేపల్లి నారాయణ, చంద్ర, లక్ష్మీకాంత్, శేఖర్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి బాల వెంకట్, జిల్లా నాయకులు శ్రీనివాసులు, ఏఎస్ఎఫ్ నాయకులు ధనుంజయ, భాస్కర్‌లు మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు మనోజ, పద్మావతి, బేబీ, తిరుపాలమ్మ, రవణమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు. **ఆళ్ళగడ్డ :** ఆళ్ళగడ్డలో అంగన్‌వాడీల దీక్షలకు యుటిఎఫ్ రిటైర్డ్ నాయకులు రామసుబ్బారెడ్డి, జనసేన నియోజకవర్గ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, సమన్వయకర్త మైలేరి మల్లయ్య, ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, ఇరిగెల విశ్వనాథరెడ్డి తదితరులు అంగన్వాడి టీచర్ల, ఆయాల నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజ్యలక్ష్మి, పెద్దక్క, వేనమ్మ, గాంధీ, శశికళ, ముంతాజ్, సిఐటియు కార్యదర్శి రమేష్ బాబు, జనసేన నాయకులు పెసరాయి చాంద్ బాషా, సజ్జల నాగేంద్ర, మహబూబ్ దౌల, మాబుహుస్సేన్, రామకృష్ణ, బాలయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** జనసేన నాయకులు రాచమడుగు సుందర్, చందులు అంగన్వాడీల సమ్మెలో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు.

బేతంచెర్ల : అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరంకుశ ధోరణి తగదని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి శేబారాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య అన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరి ష్కరించాలని 5వ రోజు చేరుకున్న అంగన్వాడీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ గుల్జార్బి, ఎంకే నాగలక్ష్మిల ఆధ్వర్యంలో బేతంచర్ల పాత బస్టాండ్ భారత్ బేకరీ సర్కిల్ నందు అంగన్వాడీలు కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు లలిత, జ్యోతి, రాజేశ్వరి, లక్ష్మి, ఆదిలక్ష్మి, కళావతి, రాధాదేవి, నారాయణమ్మ, అంజలీదేవి, హసీనా, రోజా, భూలక్ష్మి, సరోజమ్మ, సరళ, లక్ష్మీపార్వతి, రాజేశ్వరి, వరలక్ష్మి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్:** నందికొట్కూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర అంగన్వాడీలు కళ్ళకు నల్ల రిబ్బన్ కట్టుకొని 5వ రోజు నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అంగన్వాడీ సెంటర్ల తాళాలు, తలుపులు పగలగొట్టిన వారిపై కేసు నమోదు చేయాలని నందికొ ట్కూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం రిలే నిరాహార దీక్షలు మదర్ బి అధ్యక్షతన జరిగాయి. సమ్మెకు సంఘీభావంగా మాజీ శాసన సభ్యులు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని సేవలందించేస్తున్న గొప్ప వ్యవస్థని అని కొనియాడారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా అంగన్వాడీ సెంటర్లను సచివా లయ సిబ్బంది, వాలంటీర్లతో తలుపులు పగలగొట్టి వస్తువులు తీసుకొని వెళ్లడం విచారకరమని, అంగన్వాడీ సెంటర్లపై దాడి చేసిన వారిపై కేసు నమో దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఆందోళన పోరాటం కొనసాగుతుం దన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి మానుకొని అంగన్వాడీ వర్కర్స్‌తో చర్చలు జరిపి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడి దీక్షలకు ఎస్ డబ్ల్యూ ఎస్ ఆర్టిసి రాష్ట్ర నాయకులు తులసి రామ్, భాస్కర్ పా ల్గొని మద్దతు తెలియజేశారు. సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆంజ నేయులు, నాగన్న కెవిపిఎస్ నాయకురాలు రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు. **జూపాడుబంగ్లా మండలంలో** అంగన్వాడీలు జూపాడుబంగ్లా కేజీ రోడ్డుపై మోకాళ్ళ మీద నల్ల రిబ్బన్లు కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ సాబ్జీ చిత్ర పటానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భం గా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి, ఎపి వ్యకాసం జిల్లా నాయకులు ఎం కర్ణ, అంగన్వాడి వర్కర్స్ నాయకులు వెంకటరమణమ్మ, పద్మావతి, ప్రసన్న మాట్లాడారు. **పాములపాడు :** అంగన్వాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బొబ్బిలి ఎమ్మెల్యే అప్పలనాయుడు దిష్టిబొమ్మను అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాములపాడు ప్రధాన సెంటర్లో దహనం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు కళ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, అంగన్వాడి యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రమణమ్మ, బాయ్, శ్రీలత, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **వీఆర్ఏల మద్దతు :** అంగన్వాడీలు తమ డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు వీఆర్ఏల సంఘం అధ్యక్షులు పరమేశ్వరుడు, నాయకులు మౌలాలి, నారాయణ నాయక్, జన్ను సాహెబ్ సమ్మెకు పూర్తి మద్దతు తెలిపారు. అంగన్వాడీలకు పెరిగిన రేట్లు కనుగుణంగ వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. **చాగలమర్రి :** స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద సమస్యలను తీర్చాలని సిఐటియు, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో అంగ న్వాడీలు కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు పద్మావతి, వసంత, నాగమణి, వై పద్మావతి, సంజమ్మ, ఏఐటియుసి నాయకురాలు మాట్లాడారు. అంగన్వాడీల దీక్షలకు తెలుగుదేశం పార్టీ, సిఐటియు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తమ మద్దతును తెలిపి సంఘీభావం తెలిపారు.

చెవిలో పూలు పెట్టుకొని అంగన్వాడీలు వినూత్న నిరసన

బండి ఆత్మకూర్: అంగన్వాడీలు యూనియన్ నాయకులు వెంకటరమణమ్మ, వసంత, శ్యామల, ఆనందములు, సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, నాయకులు రాజు నిరసన దీక్ష శిబిరం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చెవిలో పూలు పెట్టుకొని అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని తెరిచేందుకు ప్రయత్ని స్తున్న అధికారులను స్థానికులు అడ్డుకొని అధికారులను వెనక్కి పంపడం జరిగి ందని అంగన్వాడి నాయకులు వెంకటరమణమ్మ, ఆనందమ్మ తెలిపారు. **మిడ్తూర్:** మిడుతూరు కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 5వ రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా నాయకులు పీపక్కిరి సాహెబ్, టి ఓబ్లేస్, సిఐటియు మండల నాయకులు బి వెంకటశివుడు మాట్లాడారు. అనంతరం షేక్ సాబ్జి చిత్రపటానికి నివాళులర్పించారు. **పగిడ్యాల:** 5వ రోజు అంగన్వాడీ కార్యకర్తలు కళ్ళకు గంతలు కట్టుకొని మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి మాట్లాడారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కళ్ళకు గంతలు కట్టుకొని ర్యాలీ నిర్వహించి బస్టాండులో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం. చిన్న మారెన్న, మల్లికార్జున మద్దతు తెలిపారు. అనంతరం అంగన్వాడీ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు కాశమ్మ, రమణమ్మ తదితరులు మాట్లాడారు. తెలుగుదేశం నాయకులు మైలా శ్రీనివాసరావు, రమణ, పీరా, శ్రీనివాస రెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు మల్లికార్జున, చెన్నయ్య తదితరులు మద్దతు తెలిపారు. **ఆత్మకూరు**: పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిరసన తెలిపారు. యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్, స్వాములు మాట్లాడారు. **బీఎస్పీ మద్దతు :** అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను తక్షణమే ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని బీఎస్పీ శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షు లు చంద్రశేఖర్, కన్వీనర్ శ్యామ్‌లు మద్దతు తెలియజేశారు. నాయకురాలు సుధారాణి, వెంకటలక్ష్మి, లక్ష్మి, ప్రియాంక, ప్రమీల, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సుజాత, సిఐటియు నాయకులు గణపతి, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి:** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట 5వ రోజు అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారు. తహసిల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. అనంతరం టెంటు వద్దకు వచ్చి కండ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిరసన తెలిపారు. ముందుగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు ఈ హరిత సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డి రామ్ నాయక్ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు మాట్లాడారు. **వెలుగోడు మండలంలో** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు, హెల్పర్లు తాసిల్దార్ కార్యాలయం ఎదురుగా డిమాండ్స్‌ను పరిష్కరించాలని మోకాళ్ళపై కూర్చొని కళ్ళకు నల్లగుడ్డ కట్టుకొని నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు వి నాగమోహన్, టి శ్రీనివాసులు, జిల్లా ఆవాజ్ నాయకులు మహమ్మద్ రఫీ, అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమ ంలో బజారు హమాలీ యూనియన్ నాయకులు వెంకటయ్య,కిషోర్,కృష్ణ,జి బాష, ఖాదర్ వలీ, కృష్ణ, రహంతుల్లా, మోదిన్, ప్రవీణ్, అంగన్వాడి టీచర్స్ అండ్ ఆయాలువిజయమ్మ,శ్యామల,కుమారి,నాగలక్ష్మి, తులసమ్మ, రాధిక, శశికళ, సువర్ణ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ఆత్మకూరులో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

బేతంచెర్ల : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కొత్తపల్లి: కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

సెల్ టవర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-డోన్

డోన్ మండల పరిధిలోని కనపకుంట గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని ఉమ్మడి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిట రింగ్ మాజీ కమిటీ సభ్యులు సట్టి.రాజశేఖర్ శనివారం కేంద్ర టెలి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మాజీ కమిటీ సభ్యులు సట్టి.రాజశేఖర్ మాట్లాడుతూ కనపకుంట చుట్టూ పక్కల మూడు గ్రామాలకు పదివేల జనాభా ఉందని ఇంతవరకు ఒక్క సెల్ టవర్ లేదని ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. స్పందించిన కేంద్ర మంత్రి సెల్ టవర్ ఏర్పాటుకు అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 18/2021
బైరెడ్డి బాలిరెడ్డి మరియు ఒకరు ..... వాదులు
వర్సెస్
కాటసాని పెద్దనాగిరెడ్డి మరియు ఇతరులు ..... ప్రతివాదులు
టు,
డి6. కాటసాని పెద్ద వెంకటరెడ్డి,
తండ్రి: వెంకటసుబ్బారెడ్డి
ప్లాటు నెంబరు 302, నంది టవర్స్,
బాలాజీ కాంప్లెక్స్ నంద్యాల టౌన్ మరియు జిల్లా.
డి8. పోగుల సావిత్రమ్మ, భర్త: శివశంకరరెడ్డి,
2వ వార్డు, యెమ్మినూరు గ్రామం, ఉయ్యాలవాడ మండలం. ప్రస్తుతం నంద్యాల జిల్లా.
పై నెంబరు దావాను వాదులు మీ పైన మరికొంత పైన దావా షెడ్యూలు భూముల గురించి భాగ పరిష్కారం నిమిత్తం దావాను దాఖలు చేసి ఉన్నారు. ఈ దావా నందు కోర్టు ద్వారా మీకు దావా సమనులు ఎన్ని పర్యాయములు పంపినా తీసుకొన కుండా కాలాయాపన చేసి ఉన్నారు. కావున కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా సమనులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున వాయిదా 11-01-2024వతేదీన ఉదయం 10:30 గంటలకు ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల మీరు స్వయముగా లేదా వకీలు ద్వారా హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శ చేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 11-01-2024
ఎం.సత్యనారాయణ
అడ్వకేట్, మార్కాపురం